రాష్ట్ర బడ్జెట్‌లో అన్నీ అభూతకల్పనలు.. అంకెల గారడీలు తప్ప ఏమీ లేదు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కింది. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ ప్రస్తావనే లేదు. ఆటో డ్రైవర్లకు రూ.12 వేలు ఇస్తామని చెప్పి మోసం చేశారు. ఆదాయం పెంచే మార్గాలు, నిధుల సమీకరణపై స్పష్టతలేదు. - కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

₹ పాతబస్తీ మెట్రోకు కేటాయించిన నిధులు 500 కోట్లు

ఆరింటికీ 'నో గ్యారెంటీ'

ఆరు గ్యారెంటీలకు బడ్జెట్‌లో దక్కని భరోసా

కొన్నింటి అమలు ఊసే లేని వైనం • అమలయ్యే వాటికీ నిధుల కొరత

100 రోజుల్లో అమలుకు హామీ • ఏడు నెలలు దాటినా అతీగతీ కరువు

హైదరాబాద్, జూలై 25(నమస్తే తెలంగాణ): ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు బడ్జెట్‌లో భరోసా దక్కలేదు. ఆశించిన స్థాయిలో నిధులు దక్కలేదు. కొన్నింటి అమలు ఊసే లేకపోగా, మరికొన్నింటికి అరకొరగా నిధులు కేటాయించారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో 13 హామీలు ఉన్నాయి. ప్రస్తుతం కేవలం నాలుగు హామీలనే అమలు చేస్తున్నది. అన్నింటినీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే అమలు చేస్తామని హామీ ఇచ్చింది. కానీ ఏడు నెలలు గడిచినా అతీగతీ లేదు. ఈ బడ్జెట్‌లో రైతుభరోసా, కూలీలకు భరోసా, వరి పంటకు బోనస్, చేయూత, ఇందిరమ్మ ఇండ్ల పథకం, ఇంటర్నేషనల్ స్కూల్ పథకాన్ని అమలు చేసేందుకు నిధులు కేటాయించింది.



'మహాలక్ష్మి'లో మహిళలకు సాయం ఊసేలేదు

మహాలక్ష్మి గ్యారెంటీ పథకంలో మూడు హామీలున్నాయి. వీటిలో రెండింటిని అమలు చేస్తున్నది. మరొకటైన మహిళలకు ప్రతినెలా రూ.2,500 ఆర్థికసాయం హామీపై ప్రభుత్వం బడ్జెట్‌లో ఎలాంటి ప్రస్తావన చేయకపోగా, ఒక్కపైసా కేటాయించలేదు. దీంతో ఈ పథకం అమలును ప్రభుత్వం పక్కకు పెట్టినట్టే.

రైతుభరోసా ఏదీ?

రైతుకూలీలకు భరోసా పథకంలో మూడు గ్యారెంటీలు ఉండగా ఇప్పటి వరకు ఏ ఒక్కటీ అమలు చేయలేదు. తాజాగా బడ్జెట్‌లో మూడు హామీల అమలుకు నిధులు కేటాయించింది. ఎకరాకు రూ.15 వేల చొప్పున రైతుభరోసా, వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేల చొప్పున భరోసా, వరి పంటకు క్వింటాకు రూ.500 బోనస్‌ను అమలు చేయనున్నది. ఈ మూడు హామీలకు సుమారు రూ. 32 వేల కోట్ల నిధులు అవసరం కాగా, ప్రభుత్వం మాత్రం కేవలం రూ.18 వేల కోట్లు మాత్రమే కేటాయించింది.

గృహజ్యోతికి రూ.2,418 కోట్లు

గృహజ్యోతి పథకం కింద ప్రతి కుటుంబానికి ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును అందిస్తున్నది. ఈ పథకం కోసం తాజా బడ్జెట్‌లో రూ.2,418 కోట్లు కేటాయించింది.

ఇందిరమ్మ పథకంలో రెండు మాయం

ఇందిరమ్మ ఇండ్ల గ్యారెంటీ పథకంలో ఇంటి నిర్మాణానికి స్థలం ఉన్న వారికి రూ.5 లక్షలు ఇస్తామన్న ప్రభుత్వం ఇంటి స్థలం లేని వారికి స్థలంతోపాటు రూ.5 లక్షలు, ఉద్యమకారులకు రూ.250 గజాల స్థలం ఇస్తామని హామీ ఇచ్చింది. తాజా బడ్జెట్‌లో స్థలం ఉండి ఇండ్లు నిర్మించుకునేందుకు మాత్రమే రూ.5 లక్షలు ఇచ్చేందుకు నిర్ణయించింది. మొత్తం 4.5 లక్షల ఇండ్ల నిర్మాణానికి రూ.22,500 కోట్ల నిధులు అవసరం కాగా, ప్రభుత్వం కేవలం రూ.9,184 కోట్లు కేటాయించింది. ఇక మిగిలిన రెండు హామీలను ప్రభుత్వం పక్కన పెట్టేసింది.

యువ వికాసం భరోసా మిస్

ఈ గ్యారెంటీలో విద్యార్థులకు విద్యాభరోసా కార్డు ద్వారా రూ.5 లక్షలు ఇవ్వడంతో పాటు ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో తొలి హామీని విస్మరించగా, ఇంటర్నేషనల్ స్కూళ్ల నిర్మాణానికి నిధులు కేటాయించింది.

చేయూత అందేదెలా?

చేయూత గ్యారెంటీ పథకంలో సామాజిక పింఛన్లను రూ.4 వేల పెంపుతోపాటు రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచుతామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. వీటిలో ఆరోగ్యశ్రీ పరిమితి పెంపును అమలు చేస్తున్నది. సామాజిక పింఛన్ లబ్ధిదారులు, పెండింగ్ దరఖాస్తులు కలిపితే ఏటా రూ.27 వేల కోట్ల నిధులు అవసరం అవుతాయి. ప్రభుత్వం మాత్రం బడ్జెట్‌లో కేవలం రూ.14 వేల కోట్లనే కేటాయించింది. దీంతో అర్హులైన అందరికీ రూ.4 వేల చేయూత పింఛన్ అమలవుతుందా? లేదా? అనేది ప్రశ్నగా మారింది.

మొరాయించిన 'మెట్రో' బడ్జెట్

హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ ప్రాజెక్టుకు ప్రభుత్వం చేసిన కేటాయింపులు గందరగోళంగా మారాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో కనీసం రూ.3-5వేల కోట్లు కేటాయిస్తేనే పాతబస్తీ మెట్రోతో పాటు రెండో దశ ప్రాజెక్టు పనులను పట్టాలెక్కించేందుకు అవకాశం ఉన్నదని అధికారులు ముందు నుంచీ చెప్తూ వస్తున్నారు. పార్లమెంటు ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి పాతబస్తీ మెట్రో పనులకు హడావుడిగా శంకుస్థాపన చేయటంతో ఆ మేరకే కేటాయింపులు ఉంటాయని అంతా ఆశించారు. కానీ గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పాతబస్తీ మెట్రోకు రూ.500 కోట్లు, ఎయిర్‌పోర్టు మెట్రోకు రూ.100 కోట్లు, హెచ్ఎంఆర్ఎల్‌కు రూ.500 కోట్లు.. ఇలా మొత్తంగా రూ.1100 కోట్లే కేటాయించారు. 78.4 కిలోమీటర్ల రెండో దశ మెట్రో ప్రాజెక్టుల అంచనా వ్యయం రూ.24,042 కోట్లు. దీంతో ఈ కేటాయింపు ఏమూలకు? అని అంతా పెదవి విరుస్తున్నారు. ఈ అరకొర కేటాయింపుతో అధికారులు పనులను ముందుకు తీసుకెళ్లలేని పరిస్థితి ఉన్నందున మెట్రో ప్రాజెక్టుల పనులపై మరింత జాప్యం నెలకొనే అవకాశం ఉన్నది.

బారెడు మూసీకి మూరెడు నిధులు

- లక్షన్నర కోట్ల ప్రాజెక్టుకు 1,500 కోట్లే కేటాయింపు
- భూసేకరణకూ సరిపోని నిధులు
- రేవంత్ ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో ప్రాధాన్యం కరువు

హైదరాబాద్ సిటీబ్యూరో/ప్రధాన ప్రతినిధి, జూలై 25 (నమస్తే తెలంగాణ): మూసీ అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలన్నీ మూసీలో నురగలాంటివేనని తేలిపోయింది. మూసీ సుందరీకరణ ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.లక్షన్నర కోట్లయితే బడ్జెట్‌లో కేటాయించింది మాత్రం రూ.1,500 కోట్లే. ఖర్చు చేసుడు దేవుడెరుగు.. కనీసం కేటాయింపుల్లోనూ అత్తెసరు నిధులతో లెక్కలు చూపించింది. ఇక లెక్కలు తేలి, పనులు మొదలుపెట్టాలంటే బారెడున్న మూసీ సుందరీకరణ.. మూరెడు నిధులతో ఎలా సాధ్యం అవుతుంది? అన్న ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. రూ.1,500 కోట్లు 56 కిలోమీటర్ల మేర భూసేకరణకు కూడా సరిపోవని అధికార వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఇప్పటికే ఆర్థిక రంగ సంస్థలు, ప్రతినిధులతో సంప్రదింపులు చేస్తున్న ప్రభుత్వం.. అప్పులు తెచ్చి మూసీని మెరిపించాలని భావిస్తున్నది. ఇప్పటికే పలు సంస్థలతో మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) అధికారులు సంప్రదింపులు జరపటం గమనార్హం.

తలలు పట్టుకుంటున్న అధికారులు

55 కిలోమీటర్ల పొడవునా మూసీ నదికి ఇరువైపులా రవాణా సదుపాయాలు, అందమైన పార్కులు, ఐటీ టవర్లు అంటూ గొప్పలు చెప్పగా, కేటాయించిన బడ్జెట్ చూసి మూసీ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. మూసీ ప్రక్షాళన కోసం అధికారులు నదికి ఇరువైపులా సామాజిక ఆర్థిక సర్వే నిర్వహించారు. మొత్తం 12 వేలకు అక్రమ నిర్మాణాలను గుర్తించింది. వీటన్నింటిని తొలగించి మూసీని అభివృద్ధి చేయాలంటే భూసేకరణకే భారీ మొత్తంలో ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఓ అంచనా ప్రకారం.. లెక్కతేల్చిన మొత్తం నిర్మాణాల్లో 60 శాతం నిర్మాణాలకు పరిహారాన్ని చెల్లించాలంటే రూ.వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇక డీపీఆర్, ప్రాజెక్టు నిర్మాణం, మౌలిక వసతుల పేరిట భారీ మొత్తంలో ఖర్చు తప్పదు. మూసీపై ఉన్న వంతెనల నిర్మాణం, ఆధునీకరణ, ఎస్టీపీల నిర్మాణం, మురుగు నీటి తరలింపు తదితర పనులకు రూ.వేల కోట్లు అవుతాయి. కానీ ప్రభుత్వం కేటాయించిన రూ.1,500 కోట్లు దేనికోసం ఖర్చు చేయాలనే విషయంలో అధికారులకు స్పష్టత లేకుండా పోయింది.

నిధులు ఒక్క శాతమే

ప్రాజెక్టు కోసం ఆహ్వానించిన టెండర్లను అమలు చేయాలంటేనే కనీసం రూ.400-500 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందన్న చర్చ జరుగుతున్నది. మూసీ పేరిట నిధుల సమీకరణపై సీఎం రేవంత్‌రెడ్డి నేరుగా జైకా లాంటి ఆర్థిక సంస్థలతో మంతనాలు జరిపారు. కేంద్రం నుంచి కూడా భారీ నిధులు తెచ్చుకునేలా సంప్రదింపులు చేసి రూ.10 వేల కోట్లు అడిగారు. కానీ, అక్కడి నుంచి రూపాయి కూడా రాకపోవటంతో ప్రభుత్వ ఖజానా నుంచే భారీ మొత్తంలో నిధులను వెచ్చించాల్సి ఉంటుంది. ఆదాయ వనరులకు ఆస్కారం లేకపోవటంతో నిధులు సమీకరణ కష్టంగానే ఉన్నట్టు తెలిసింది.

హైదరాబాద్ అభివృద్ధికి 10 వేల కోట్లు

హైదరాబాద్‌లో ఫ్లైఓవర్లు, ఆర్వోబీల వంటి రవాణా వ్యవస్థల ఏర్పాటుతో పాటు నాలాల పూడికతీత, వరద మళ్లింపు నిర్మాణ పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెచ్-సిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేషన్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్)కి రూ.2,675.35 కోట్లు సహా జీహెచ్ఎంసీకి రూ.3,075.7 కోట్లు కేటాయించింది. హెచ్ఎండీఏకు రూ.500 కోట్లు కేటాయించినప్పటికీ ఏ ప్రాజెక్టుకు దీనిని ఖర్చు పెట్టాలనేదానిపై అధికారుల్లోనూ స్పష్టత లేదు. హెచ్ఎండీఏ తలపెట్టిన ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి రూ.3,800 కోట్లు కావాల్సి ఉన్నందున ఈ కేటాయింపు దేనికి సరిపోతుందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. జలమండలికి ఈ బడ్జెట్‌లో రూ.3,385 కోట్లు కేటాయించగా, ఇందులో అభివృద్ధి పనులకు రూ.1,450 కోట్లు, సుంకిశాల ప్రాజెక్టుకు రూ.1,000 కోట్లు, ఉచిత మంచినీటి పథకానికి రూ.300 కోట్లు వెచ్చించనున్నారు. పేద ప్రజల వైద్య సేవల కోసం కేసీఆర్ ప్రభుత్వం మొదలుపెట్టిన సూపర్‌స్పెషాలిటీ దవాఖానల నిర్మాణానికి అరకొర కేటాయింపులే జరిపారు. మూడు దవాఖానలతో వరంగల్‌లోని దవాఖానల నిర్మాణానికి కలిపి రూ.260 కోట్లు మాత్రమే కేటాయించారు. మొత్తంగా హైదరాబాద్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.10వేల కోట్లు కేటాయించింది.

నిమ్స్ బడ్జెట్ 3 కోట్లే

ప్రస్తావనకురాని గాంధీ, ఉస్మానియా

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 25 (నమస్తే తెలంగాణ): నిత్యం వేల సంఖ్యలో ఓపీ ఉండే ఉస్మానియా, గాంధీ, నిలోఫర్, ఫీవర్ తదితర హాస్పిటల్స్‌కు ఈ బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వకపోగా నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్) బడ్జెట్‌లో భారీ కోత విధించింది. గత ప్రభుత్వం నిమ్స్‌కు ప్రతి బడ్జెట్‌లో వందల కోట్లు వెచ్చించగా కాంగ్రెస్ సర్కార్ కేవలం రూ.3 కోట్లు కేటాయించింది. కేసీఆర్ సర్కార్ ప్రతిష్టాత్మకంగా నిర్మించతల పెట్టిన సూపర్‌స్పెషాలిటీ దవాఖానలకు రూ.260 కోట్లు కేటాయించింది.

సలహాలిస్తే తీసుకుంటం

కేసీఆర్ సలహాలు ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుంది. బీఆర్ఎస్ నాయకులు కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి కరీంనగర్ జిల్లాకు ఎన్ని టీఎంసీల నీళ్లు ఇచ్చారో చెప్పాలి. ఏడు నెలల కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న బీఆర్ఎస్ నేతలు.. పదేండ్ల పాలనపై చర్చకు సిద్ధమా?

- మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాపాలనకు అద్దం

ఆర్థిక మంత్రి భట్టి ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్ ప్రజాపాలనకు అద్దం పట్టేలా ఉన్నది. ఆరు గ్యారెంటీలకు నిధులు కేటాయించారు. కేసీఆర్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరం.

-మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ముస్లింలకు మోసం

కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి ముస్లింలను మోసం చేసింది. అధికారంలోకి వస్తే ముస్లింల సంక్షేమానికి రూ.4 వేల కోట్లు, స్వయం ఉపాధికి రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. బడ్జెట్‌లో కేవలం రూ.3003 కోట్లే కేటాయించడం సరికాదు. సబ్‌ప్లాన్ హామీని కూడా విస్మరించారు.

- ఇంతియాజ్ ఇసాక్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్

ఇంటి గోడలైనా లేస్తయా?

- ఇందిరమ్మ ఇండ్లకు అరకొర కేటాయింపులు
- కావాల్సింది రూ. 22.5 వేల కోట్లు
- కేటాయించింది రూ. 9,184 కోట్లు
- ఇందులో సింహభాగం కేంద్ర వాటానే
- ఎస్సీ, ఎస్టీలకు రూ.6 లక్షల సహాయం
- మిగిలిన వర్గాలకు రూ.5 లక్షలు

ఇందిరమ్మ ఇండ్ల పథకం వివరాలివీ..

రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం **4,50,000** ఇండ్లు (ఏడాదికి)

రూ.5లక్షల చొప్పున ఇస్తే కావాల్సింది రూ. **22,500** కోట్లు

ప్రభుత్వం కేటాయించిన నిధులు రూ. **9,184** కోట్లు

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): ఇందిరమ్మ ఇండ్ల పథకానికి రాష్ట్ర ప్రభుత్వం అరకొర నిధులే కేటాయించింది. ఈ ఏడాది రూ.4.5 లక్షల ఇండ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ బడ్జెట్ కేటాయింపులు మాత్రం ఏ మూలకూ సరిపోయేలా లేవు. రూ. 22.5వేల కోట్ల కన్నా అధికంగా నిధులు అవసరం కాగా, రూ.9,184 కోట్లే కేటాయించారు. అందులోనూ కేంద్రం ద్వారా వచ్చే నిధులే ఎక్కువ. గత ఏడాది కేసీఆర్ ప్రభుత్వం ఇండ్ల నిర్మాణానికి రూ.13,428 కోట్లు కేటాయించగా, ఈసారి ప్రభుత్వం రూ.9,184 కోట్లతోనే సరిపుచ్చింది. ఈ పథకం కింద ఎస్సీ,ఎస్టీలకు రూ.6 లక్షలు, ఇతరులకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నట్టు ఆర్థిక మంత్రి భట్టివిక్రమార్క తెలిపారు. ఒక్కో నియోజకవర్గంలో 3,500 ఇండ్ల చొప్పున మొత్తం రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇండ్లు నిర్మించనున్నట్టు ప్రకటించారు. రాష్ట్రంలో 4.5 లక్షల ఇండ్లను నిర్మించాలన్నది లక్ష్యం కాగా, ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో రెండున్నర లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రెండు లక్షల ఇండ్లు నిర్మించాలని నిర్ణయించారు. ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం చేసినా రూ.22,500 కోట్లు అవసరమవుతాయి. తాజాగా ఎస్సీ, ఎస్టీలకు రూ.6 లక్షల చొప్పున ఇవ్వనున్నట్టు ప్రకటించటంతో దీనికి మరిన్ని నిధులు అవసరం అవుతాయి. పీఎం ఆవాస్ యోజన (అర్బన్), పీఎం ఆవాస్ యోజన (రూరల్) పథకం కింద రూ.7117.55 కోట్లు కేంద్రం నుంచి వస్తాయని, దీనికితోడు హౌసింగ్‌బోర్డు, హౌసింగ్ కార్పొరేషన్లకు హడ్కో ద్వారా రూ.1,150 కోట్లు రుణం ద్వారా సమీకరించనున్నట్టు ప్రభుత్వం బడ్జెట్‌లో వెల్లడించింది.

గొప్పలే.. నిధుల్లేవ్

ఇందిరమ్మ ఇండ్ల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ, ఇందులో రాష్ట్ర ప్రభుత్వ నిధులు నామమాత్రమే. దీన్ని బట్టి పేదల గృహ నిర్మాణంపై ప్రభుత్వ చిత్తశుద్ధి ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. గత ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్రూం ఇండ్లలో అసంపూర్తిగా ఉన్న ఇండ్లను కూడా పూర్తిచేసి పేదలకు కేటాయిస్తామని ఆర్థికమంత్రి తెలిపారు. అయితే, ప్రభుత్వం చెప్తున్న ఈ నాలుగున్నర లక్షల ఇండ్లలో ఆ డబుల్ బెడ్రూం ఇండ్లు కూడా ఉంటాయా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇల్లు కనీసం 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆర్‌సీసీ కప్పుతో ఒక వంటగది, ఒక టాయిలెట్ తప్పనిసరి. పట్టణ ప్రాంతాల్లో స్థలం లభ్యతను బట్టి గ్రూప్ హౌసింగ్, అపార్ట్‌మెంట్లు నిర్మిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం స్థలం ఉన్నవారు తమ సొంత స్థలంలో ఇండ్లను నిర్మించుకొనే వెసులుబాటు ఉంటుంది. దీనికోసం ప్రభుత్వం రూ.5 లక్షల చొప్పున ఇవ్వాల్సి ఉంటుంది. అయితే కేంద్రం నుంచి గరిష్ఠంగా రాష్ట్రానికి రెండు లక్షల ఇండ్లే మంజూరయ్యే అవకాశం ఉన్నదని అధికార వర్గాలు చెప్తున్నాయి. అంతేకాదు, కేంద్రం ఒక్కో ఇంటికి రూ.1.5 లక్షల నుంచి రూ.2.5 లక్షలు మాత్రమే ఇస్తుంది. పైగా, లబ్ధిదారుల ఎంపిక కూడా కేంద్ర నిబంధనల ప్రకారమే, కేంద్ర ప్రభుత్వ యాప్‌లోనే చేయాల్సి ఉంటుంది. కేంద్రం రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకొని ఇండ్లను మంజూరు చేస్తుంది. రాష్ట్ర జోక్యం ఉండదు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఒక్కో నియోజకవర్గంలో మూడున్నర వేల ఇండ్లు నిర్మిస్తామని ప్రకటించింది. కేంద్ర నిధులను ఉపయోగించుకుంటే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినట్టు నియోజకవర్గాలవారీగా ఇండ్లను మంజూరుచేసే అవకాశం లేదు.

కల్యాణలక్ష్మి తులం బంగారం తరుగు!

- పెండ్లినాడే అందిస్తామని నాడు హామీ
- బడ్జెట్‌లో కానరాని కేటాయింపులు
- పెండింగ్‌లో 82 వేల దరఖాస్తులు

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): కల్యాణలక్ష్మి పథకం కింద పేదింటి ఆడబిడ్డల పెండ్లికి రూ.1,00,016 నగదుతో పాటు తులం బంగారం ఇస్తామన్న కాంగ్రెస్ హామీ అటకెక్కింది. అందుకు తాజా బడ్జెట్‌లో చేసిన కేటాయింపులే నిదర్శనం. కల్యాణలక్ష్మిపై పథకంపై అధికారులు ప్రభుత్వానికి ఇప్పటికే నివేదిక అందజేశారు. కానీ, ప్రస్తుత బడ్జెట్‌లో తులం బంగారాన్ని అందించేందుకు సరిపడా నిధులు కేటాయించలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించిన తరహాలోనే కల్యాణలక్ష్మి పథకం అమలు కోసం ఎస్సీలకు రూ.500 కోట్లు, ఎస్టీలకు రూ.260 కోట్లు, మైనార్టీలకు రూ.450 కోట్లు కేటాయించింది. బీసీలకు గతంలో రూ.2వేల కోట్లు కేటాయించగా, కాంగ్రెస్ ప్రభుత్వం స్వల్పంగా రూ.175 కోట్లు పెంచి రూ.2,175 కోట్లు కేటాయించింది. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద ఏటా దాదాపు 1.50 నుంచి 2 లక్షల మంది ఆడబిడ్డలు ఆర్థిక సాయాన్ని అందుకుంటున్నారు. ఇప్పటికే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు సంబంధించి 82 వేలకుపైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అందులో ఈ ఆర్థిక సంవత్సరంలో వచ్చినవే 30 వేలకుపైగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించిన నిధులు నగదు సాయానికే సరిపోతాయి. తులం బంగారం హామీ అమలు అటకెక్కిన ట్టేనని అర్థమవుతున్నది.

బాబు టూర్ ఎఫెక్ట్.. ఏపీ బకాయి మాఫ్?

- *అంతర్రాష్ట్ర సర్దుబాట్ల పద్దును సున్నాగా చూపిన సర్కార్*
- *అనుమానం వ్యక్తంచేస్తున్న ఆర్థికరంగ నిపుణులు*

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): ఏపీ సీఎం చంద్రబాబు రాష్ట్ర పర్యటన ప్రభావం బడ్జెట్‌పై కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నదని నిపుణులు విశ్లేషిస్తున్నారు. 2023-24 బడ్జెట్ అంచనాల్లో అంతర్రాష్ట్ర సర్దుబాట్లు పద్దులో రూ.17,828 కోట్లు రావాల్సిన ఉన్నాయని సర్కార్ పేర్కొన్నది. ఈ మొత్తం ఏపీ విద్యుత్తు సంస్థల నుంచి తెలంగాణకు రావాల్సి ఉన్నది. వీటితోపాటు ఉమ్మడి ఆస్తుల నిర్వహణ కింద రాష్ట్రానికి ఏపీ నుంచి రావాలసినవి రూ.405 కోట్లు ఉన్నాయి. 2014-15 ఆర్థిక సంవత్సరంలో కేంద్రం తెలంగాణకు ఇవ్వాల్సిన సీఎస్ఎస్ నిధులు రూ.495 కోట్లను పొరపాటున ఏపీ ఖాతాలో జమచేసింది. ఈ మొత్తాన్ని రాబట్టేందుకు కేసీఆర్ సర్కార్ తీవ్ర ప్రయత్నాలు చేసింది. 2024-25 బడ్జెట్‌లో ప్రభుత్వం అంతర్రాష్ట్ర సర్దుబాట్ల పద్దును సున్నాగా పేర్కొన్నది. దీంతో ఏపీ నుంచి వివిధ శాఖలు, పద్దుల కింద రావాల్సిన బకాయిలను సర్కార్ మాఫ్ చేసినట్టే ఉన్నదని ఆర్థిక నిపుణులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఈ బడ్జెట్ సంతోషదాయకం

రాష్ట్రానికి రూ.6 లక్షల 71 వేల కోట్లు అప్పు ఉన్నా.. రూ.2.91లక్షల కోట్లతో బడ్జెట్ తయారు చేయడం సానుకూలం. వ్యవసాయ రంగానికి రూ.72వేల కోట్లు కేటాయింపులు చేయడం రైతాంగంపై ప్రభుత్వానికి ఉన్న సానుకూలతకు అద్దం పడుతున్నది. విద్యా, వైద్యరంగాలకు మరికొంత కేటాయింపులు పెంచాలి. జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి. అసంఘటిత రంగాన్ని ఆదుకోవడానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి.

-కూనంనేని సాంబశివరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే

కేటాయింపులను స్వాగతిస్తున్నాం

వ్యవసాయం, దళిత, గిరిజన, విద్య, వైద్యరంగాలకు కేటాయింపులను స్వాగతిస్తున్నాం. ఇండ్ల నిర్మాణానికి బీసీలకు రూ.5 లక్షలు, దళితులకు రూ.6 లక్షలు , నియోజకవర్గానికి 3500 ఇండ్లు కేటాయిస్తామని ప్రకటించి రూ.8424 కోట్లు మాత్రమే కేటాయించారు. ఇండ్ల నిర్మాణానికి రూ.10 లక్షల చొప్పున ఇవ్వాలి. మహిళలకు వడ్డీలేకుండా రూ.2లక్షల ఆర్థిక సాయం ఇవ్వాలి

- తమ్మినేని, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి

గాడిద గుడ్డు.. బడ్జెట్

కాంగ్రెస్ బడ్జెట్‌లో 6 గ్యారెంటీలకు నిధులు గాడిద గుడ్డేనా? రూ.లక్షన్నర కోట్లతో నిర్మిస్తామన్న మూసీ రివర్ ఫ్రంట్‌కు బడ్జెట్‌లో పైసా కేటాయించలేదు. రంజాన్‌కు రూ.33 కోట్లు కేటాయించి.. హిందువుల పండుగలకు నయాపైసా కేటాయించకపోవడం మతతత్వం కాదా ? మహాత్ముడి వ్యాఖ్యలపై ఆత్మపరిశీలన చేసుకోవాలి.

-బండి సంజయ్, కేంద్రమంత్రి

నిరాశపరిచింది

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులను బడ్జెట్ నిరాశ పరిచింది. ఐదు విడతల కరువుభత్యం విడుదల డిమాండ్‌ను పట్టించుకోకపోవడం అన్యాయం. మధ్యంతర భృతి ప్రస్తావన లేదు. ఈహెచ్ఎస్ బలోపేతం చేస్తామని హామీ ఇచ్చినా ప్రస్తావించలేదు. బడ్జెట్‌లో ఎక్కడా ఉద్యోగుల సంక్షేమం కనపడలేదు. వివక్ష మాత్రమే ఉన్నది.

- దేవీప్రసాద్, కార్పొరేషన్ మాజీ చైర్మన్



పాలసీ లేదు.. పథకం లేదు

రాష్ట్ర బడ్జెట్‌లో అన్ని వర్గాలకు నిరాశే ఎదురైంది. రైతులనే కాదు, కౌలు రైతులు, రైతు కూలీలనూ కాంగ్రెస్ మోసం చేసింది. రైతు భరోసా, దళిత బంధు, గొర్రెల పంపిణీ, మత్స్యకారులకు భరోసాకు కేటాయింపులే లేవు. ఇది పూర్తిగా 'రైతు వ్యతిరే